సాక్షి కామారెడ్డి

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



రక్త పరీక్షలు చేయాలి

జ్వరపీడితులకు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ వైద్యులకు సూచించారు.

- 8లో ▸



ఘనంగా గోకులాష్టమి

జిల్లాలో శనివారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /21.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి ఆదాయం



బాన్సువాడ : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ బస్‌డిపోకు వచ్చిన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నిజామాబాద్ నుంచి జహీరాబాద్‌కు(వయా బోధన్, బాన్సువాడ, నిజాంసాగర్), మరొకటి బాన్సువాడ నుంచి నారాయణ్‌ఖేడ్ (వయా పిట్లం, నిజాంపేట్) నడుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సరితాదేవి, బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

నియోజకవర్గానికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాన్సువాడలో పంపిణీ చేశారు. బాన్సువాడ రూరల్‌లో 23 మందికి రూ.7.11 లక్షలు, మున్సిపాలిటీలో 10 మందికి రూ.3.24 లక్షలు, బీర్కూర్ మండలంలో ఐదుగురికి రూ.1.56 లక్షలు, నస్రుల్లాబాద్ మండలంలో 10 మందికి రూ. 3.39 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీ నియామకం



కామారెడ్డి అర్బన్: స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీని శనివారం ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ బొడ్డు శంకర్ ప్రకటించారు. స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా సంయోజక్‌గా బి.మహేష్‌రెడ్డి, సహ సంయోజక్‌గా ఏ.రాజేశ్వర్‌గౌడ్, విచార విభాగ ప్రముఖ్‌గా లింబాగౌడ్, మహిళా ప్రముఖ్‌గా మండల శైలజ, సంపర్క్ ప్రముఖ్‌గా ఇటిక్యాల మహేష్, సంఘర్షణ ప్రముఖ్‌గా సంతోష్ నేత, పర్యావరణ ప్రముఖ్‌గా నరేష్, శోధ్ ప్రముఖ్‌గా దిలీప్, ప్రౌఢ ప్రముఖ్‌గా బి.రాములు, యువ ప్రముఖ్‌గా నవీన్‌గౌడ్, ప్రచార ప్రముఖ్‌గా బి.గౌతమ్‌లను నియమించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ సంతోష్‌రెడ్డి, మంచ్ తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ జి.అశోక్, ఇందూర్ విభాగ్ సహ సంయోజక్ రాజాగౌడ్, ప్రాంత యువ ప్రముఖ్ డాక్టర్ రాహుల్, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి డాక్టర్ యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

'వార్షిక టోల్ పాస్‌ను సద్వినియోగం చేసుకోండి'



పిట్లం: వార్షిక టోల్ పాస్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంగళూరు టు మహారాష్ట్ర బార్డర్ హైవే మెయింటెనెన్స్ కం రెసిడెన్స్ ఇంజినీర్ రవి శంకర్ సూచించారు. శనివారం ధర్మారం టోల్ ప్లాజా వద్ద వాహనాల కోసం వార్షిక పాస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రీ బుకింగ్ శుక్రవారం ప్రారంభమైందన్నారు. పాస్ యాక్టివేట్ అయిన తర్వాత నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుందన్నారు. జాతీయ రహదారులపైనే చెల్లుతుందని, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని హైవేలపై వర్తించదని పేర్కొన్నారు. వార్షిక పాస్ వాణిజ్య వాహనాలకు వర్తించదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టోల్ ఎక్స్‌పర్ట్ మహమ్మద్ రఫీ, క్యూబ్ హైవేస్ మేనేజర్ అక్షయ్ కుమార్, ధర్మారం టోల్ ప్లాజా కాంట్రాక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు

దంచికొట్టిన వాన

- అలుగెల్లిన పోచారం ప్రాజెక్టు
- నిజాంసాగర్‌కు పెరిగిన వరద
- చెరువులు, కుంటల్లోకి చేరిన నీరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాను ప్రభావంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. దీంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పోస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద వస్తోంది. జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు నిండి అలుగు పారుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. కొన్ని చోట్ల వర్షంతో పాత ఇళ్లు కూలిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో అత్యధికంగా రామారెడ్డిలో 123.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ తదితర మండలాలు మినహా జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

ఉప్పొంగిన వాగులు..

లింగంపేట మండలంలో పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పోల్కంపేట, భవానీపేట, నాగారం కాసుకత్త వాగులు పారుతున్నాయి. తాడ్వాయి మండలంలోని భీమేశ్వర వాగు, ఎర్రాపహడ్, కరడ్‌పల్లి, కాళోజీవాడి, కన్కల్, చందాపూర్, సోమారం ప్రాంతాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. గాంధారి మండంలోని దుర్గం- గుజ్జుల్, గుర్జాల్- వండ్రికల్, గాంధారి-తిప్పారం మధ్య వాగులు ఉధృతంగా పారుతున్నాయి. మద్నూర్ మండలంలోని అంతాపూర్ సమీపంలో లోలెవల్ వంతెనపై నుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో మద్నూర్-జుక్కల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చిన్న ఎక్లారలోంచి వాగు ప్రవహించింది. గ్రామంలోని హనుమాన్ ఆలయం, వాటర్ ట్యాంక్ చుట్టూ ఉన్న ఇళ్లలో వరదనీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. మాచారెడ్డి మండలంలో పాల్వంచ వాగు ఉధృతంగా పారుతోంది. ఎల్పుగొండ తండాకు వెళ్లే రోడ్డు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగింది. రామారెడ్డి మండలంలోని కన్నాపూర్‌లో వాగు పొంగి ప్రవహిస్తోంది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వాగును పరిశీలించారు.

దెబ్బతిన్న ఇళ్లు.. నీట మునిగిన పంటలు

మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన రావుల సిద్ది రాములు, కిషన్‌రావు, రాజు, మల్లీశ్వరిలకు చెందిన ఇళ్లు శనివారం కూలిపోయాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాజంపేట మండలం ఆరెపల్లి తండాకు చెందిన లంబాడి శంకర్ ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. గాంధారి మండలం జువ్వాడిలో చాకలి సంగవ్వకు చెందిన ఇల్లు కూలింది. ఆ ఇంట్లో ఎవరూ నివసించకపోవడంతో ప్రమాదం తప్పింది. చెన్నాపూర్‌లో సూర లలిత, సంపంగి మల్లేష్‌లకు చెందిన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గాంధారి తహసీల్దార్ రేణుకా చౌహాన్ తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నమోదైన వర్షపాతం..(మి.మీ.)

లొకేషన్	వర్షపాతం						
		సదాశివనగర్	60.5	నస్రుల్లాబాద్	36.0	బీర్కూర్	28.3
రామారెడ్డి	123.3	కలెక్టరేట్	58.8	జుక్కల్	35.3	లచ్చాపేట్	25.8
సోమూర్	89.8	సర్వాపూర్	54.8	కొల్లూర్	34.0	నాగిరెడ్డిపేట	21.8
రాంలక్ష్మణ్‌పల్లి	87.3	లింగంపేట	50.5	పాతరాజంపేట	32.8	మేనూర్	21.3
మక్దుంపూర్	71.5	బొమ్మన్‌దేవ్‌పల్లి	43.0	ఇసాయిపేట	32.5	బిచ్కుంద	20.0
గాంధారి	69.8	అర్గొండ	42.5	పెద్దకొడప్‌గల్	31.5		
తాడ్వాయి	62.3	హసన్‌పల్లి	38.0	మాచాపూర్	28.3		

జల దిగ్బంధంలో లింబూర్‌వాడి

మద్నూర్ : డోంగ్లీ మండలంలోని లింబూర్ వాడి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. భారీ వర్షాలు కురవడంతో లింబూర్, లింబూర్ వాడి మధ్యలోనున్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



చిన్న ఎక్లార గ్రామాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

వరద ప్రాంతాల పరిశీలన

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి లింబూర్‌వాడి వాగు వద్దకు పంచాయతీ ట్రాక్టర్‌లో వెళ్లారు. వాగుకు అవతలి వైపు ఉన్న గ్రామస్తులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎవరూ వాగు దాటి రావద్దని సూచించారు. అనంతరం మద్నూర్ మండలంలోని అంతాపూర్ వద్ద మద్నూర్-జుక్కల్ రహదారిపై గల వంతెనను పరిశీలించారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. చిన్న ఎక్లార గ్రామానికి వెళ్లి పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా గ్రామం గుండా వెళ్తున్న వాగు పొంగిపొర్లడంతో వరద నీటిలో విరిగిన చెట్ల కొమ్మలు కొట్టుకుని వచ్చి పైప్‌లైన్‌లో తట్టుకున్నాయని, దీంతో నీరు గ్రామంలోకి చేరిందని పేర్కొన్నారు. వెంటనే పొక్లెయిన్ సహాయంతో వాటిని తొలగించారు. ఆమె వెంట తహసీల్దార్ ముజీబ్, బిచ్కుంద సీఐ రవికుమార్, ఎస్సై విజయ్‌కొండ తదితరులున్నారు.

భారీ వర్షాల కారణంగా మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని పంటలకు నష్టం వాటిల్లింది. సోయాబీన్, చెరుకు, పత్తి పంటలు నీట మునిగాయి. చిన్న ఎక్లార, లచ్చన్, కొడిచిర, ధన్నూర్ శివారులోని పంటలు నీట మునిగాయని రైతులు తెలిపారు.



మాచారెడ్డిలో కూలిన ఇల్లు



గాంధారి మండలం జువ్వాడిలో..



మద్నూర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు



సంతాయిపేట్ భీమేశ్వర ఆలయానికి ఆనుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



లచ్చన్ శివారులో నీట మునిగిన సోయా పంట

ప్రాజెక్టు సమాచారం..

నిజాంసాగర్‌కు 35,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ : మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం పెరిగింది. పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో శనివారం 10 వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్‌లోకి వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఘనపురం ఆనకట్ట, హల్దీవాగు, సింగూరు ప్రాజెక్టు ద్వారా 25,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,398.08 అడుగుల (9.407 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సింగూర్ ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్టులోని శనివారం 31వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో సింగూరు ప్రాజెక్టు 5గేట్ల ఎత్తివేసి 45 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. దీంతో ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టును చేరనుంది.

పొంగుతున్న 'పోచారం'

- 12,867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టును సందర్శించిన ఆర్డీవో, డీఎస్పీ

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. శుక్రవారం రాత్రి ఎగువన కురిసిన భారీ వర్షాలతో శనివారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి వరదనీటి చేరిక మొదలయ్యింది. ఉదయం 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సాయంత్రానికి 12 వేలు దాటింది. 12,867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 21.5 అడుగుల(1.820 టీఎంసీ)తో ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో అంతే నీరు అలుగుపైనుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రావు ప్రాజెక్టును సందర్శించారు. ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లుతో మాట్లాడి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు, మంజీర పరీవాహక ప్రాంతాలకు ప్రజలెవరూ వెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీవో సూచించారు. ప్రాజెక్టు వద్దకు ప్రజలెవరూ వెళ్లకుండా బందోబస్తే ఏర్పాటు చేయాలని డీఎస్పీ ఆదేశించారు. వారివెంట నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఐ రాజిరెడ్డి, ఎస్సై భార్గవ్‌గౌడ్, ఎంపీడీవో ప్రభాకరచారి, ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌కుమార్ తదితరులున్నారు.



పోచారం ప్రాజెక్టు చిన్న అలుగుపైనుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

సింగితంలోకి 1,200 క్యూసెక్కులు..

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి 1,200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో శనివారం మూడు గేట్లను ఎత్తి వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించారు.

కౌలాస్‌లోకి 1,851 క్యూసెక్కులు..

కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలకు కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 1,851 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 456.40 మీటర్ల (0880 టీఎంసీ) నీరు నిల్వ ఉందన్నారు.

కల్యాణి ప్రాజెక్టు మూడు గేట్ల ఎత్తివేత

ఎల్లారెడ్డిరూరల్ : తిమ్మారెడ్డి గ్రామ శివారులోని కల్యాణి ప్రాజెకులోకి శనివారం 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులకుగాను 408.30 అడుగుల నీటిని నిలువ ఉంచుతున్నామన్నారు. అదనంగా వస్తున్న నీటిలో 100 క్యూసెక్కులను నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లిస్తుండగా.. 700 క్యూసెక్కుల నీటిని మూడు వరద గేట్లను ఎత్తి మంజీర నదిలోకి వదుతున్నట్లు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

- మందులు అందుబాటులో ఉన్నాయి
- ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది
- డీఎంఈ నరేంద్రకుమార్

కామారెడ్డి టౌన్ : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నరేంద్ర కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ అజయ్ కుమార్‌తో కలిసి జీజీహెచ్‌ను సందర్శించారు. బ్లడ్ బ్యాంక్, ల్యాబ్, ఐసీయూ, ట్రామా, ఎక్స్‌రే, డయాలసిస్, ఓపీ, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. డెంగీకి సంబంధించి రక్తపరీక్షలు, ప్లేట్‌లెట్స్ వైద్య సేవలపై ఆరా తీశారు. రక్తఫలికలను వేరు చేసే ఎస్‌డీపీ యంత్రం సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆర్‌ఎంవో సంతోష్‌కు సూచించారు. ఇన్నేళ్లుగా యంత్రాన్ని వినియోగించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మలేరియా, డెంగీ, డయేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించి వైద్య సేవలు అందించేందుకు సరిపడా బెడ్స్, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎమర్జెన్సీ సేవల కోసం పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. జిల్లాలో గతనెలలో 81 డెంగీ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసులు నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్, సూపరింటెండెంట్‌లు విచారణ చేస్తున్నారన్నారు.

త్వరలో సిటి, ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలు..

జీజీహెచ్‌లో సిటి, ఎంఆర్‌ఐ సేవలను త్వరలోనే ప్రారంభిస్తామని డీఎంఈ తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్దనున్న దేవి ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించారు. సీజనల్ వ్యాధుల బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వైద్యులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమస్యలు..

వర్షాలతో ఆస్పత్రి భవనం పైకప్పునుంచి నీరు లీకవుతోంది. దీంతో నీరు కింద పడకుండా చూసేందుకు సిబ్బంది నీరు ఊరుస్తున్న ప్రాంతాలలో డబ్బాలు, చెత్తబుట్టలను ఉంచారు. డీఎంఈ వాటిని చూస్తూ ముందుకు వెళ్లారు. ఎమర్జెన్సీ, మెటర్నిటీ వార్డులలోనూ ఇదే పరిస్థితి ఉంది. వంటశాలలో భవనం పైకప్పు పెచ్చులూడుతున్నాయి.



జీజీహెచ్ మందుల విభాగంలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంఈ నరేంద్రకుమార్



జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న డీఎంఈ, ఊరుస్తున్న నీరు కిందపడకుండా హాల్ మధ్యలో పెట్టిన డబ్బా

క్లుప్తంగా

ఈనెల 19న ఏచూరి సంస్మరణ సభ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 19న పట్టణ మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపంలో సీపీఎం పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేకర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, శాఖ కార్యదర్శులు, సభ్యులు, శ్రేణులు, రైతులు, కార్మికులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్ గౌడ్, మొతీరాం నాయక్, కొత్త నర్సింలు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 16న మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్ పోటీలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో నవంబర్ 16న మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిమ్ ప్రతినిధులు నవీన్, యాసిన్‌లు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి జిమ్ యజమానుల ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా కామారెడ్డిలో జిల్లా స్థాయి బాడీ బిల్డర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఏడు కేటగిరీలు ఉంటాయని వివరించారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు 9848278436 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని బాడీ బిల్డర్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, లిఖిత్‌గౌడ్, మహిపాల్, రథిఫ్ రెడ్డి, తేజ, ఎజాజ్, దేవా తదితరులున్నారు.

షెడ్డును ప్రారంభించిన సైంటిస్ట్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట గ్రామ పంచాయతీ సమీపంలో దాత అయిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి శనివారం తన సొంత నిధులతో షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు గ్రామాల్లో ఇప్పటి వరకు తన వంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భిక్కనూరులో గోపిక, శ్రీకృష్ణవేషధారణలో చిన్నారులు



దేవునిపల్లిలో క్రియాన్ష్ ఆధ్యా పాటిల్‌లు



ఎల్లారెడ్డిలో ..



బీర్కూర్‌లో ..



మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో ..



పాతరాజంపేటలో.. అభినయ్ సిద్ధార్థ పటేల్

కృష్ణం వందే జగద్గురుమ్



బాన్సువాడలో..



నర్వలో .. దేవాన్ష

సాక్షి, నెట్‌వర్క్ :కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు,గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం వారు ఉల్లాసంగా ఉట్టి కొట్టారు. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో బ్రహ్మ జ్ఞానాశ్రమంలో మురళీకృష్ణ విగ్రహనికి పంచామృతాభిషేకాలు అర్చన,చప్పన్‌బోగ్ మిఠాయిల సమర్పణ,గోపాలకాల్వలు, ఉట్టికొట్టు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. రామారెడ్డిలోని రామాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని గోపూజ నిర్వహించారు.విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ పరిషత్ జిల్లా నాయకులు, మహిళా శక్తి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని శ్రీకృష్ణ ధ్యాన మందిరం, ఇస్కాన్ కేంద్రం, శ్రీ గీతా మందిరంతో పాటు ఆయా ఆలయాల వద్ద విశేష పూజలతో పాటు చిన్నపిల్లలతో రాధ, కృష్ణులు, గోపికల వేషధారణతో అలంకరించారు. శ్రీనివాసనగర్‌లోని శ్రీకృష్ణ ధ్యానమందిరంలో తొట్టెల, నామకరణ, ఉట్టి కార్యక్రమాలు నిర్వహించారు.సిరిసిల్లరోడ్డులోని శ్రీగీతా మందిరంలో అర్ధ చాతుర్యాస్య ఉత్సవాల్లో భాగంగా గోకులష్టమి ఉత్సవాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ జ్ఞానచైతన్యనంద స్వామిజీ గీతాప్రవచనాలు చేశారు.ఇస్కాన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు,జాలన్ సేవ, మహాహారతి, చప్పన్‌భోగ్ నిర్వహించారు.



దోమకొండలోని త్రివేణి పాఠశాలలో..



లింగంపేటలో ..



జంగంపల్లిలో మురళికృష్ణుడికి సమర్పించిన చప్పన్ భోగ్



భిక్కనూరులో ..



నస్రుల్లాబాద్‌లో ..



కామారెడ్డిలోని శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో వేడుకలు నిర్వహిస్తున్న ప్రజలు



రామారెడ్డిలో గోపూజ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

కన్నాపూర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- వర్షంలోనే కొనసాగిన ఎమ్మెల్యే పర్యటన



కన్నాపూర్ మత్తడివాగు ముందు మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రామారెడ్డి: వర్షాలు ముగిసిన వెంటనే మండలంలోని కన్నాపూర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం రామారెడ్డి మండలంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పర్యటించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కన్నాపూర్ మత్తడివాగు వాగును వర్షంలోనే ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలోనే సంబంధిత మంత్రి దృష్టి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 40 ఏళ్లుగా కన్నాపూర్ నుంచి కామారెడ్డికి వెళ్లేందుకు కన్నాపూర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే పరిష్కారిస్తామన్నారు. పనులకు సంబంధించిన విషయమై అక్కడి నుంచే ఎమ్మెల్యే డీఈ బాల్‌లింగంతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం కన్నాపూర్, కన్నాపూర్ తండా, పోసానిపేట్,ఉప్పల్‌వాయి గ్రామాల్లో వర్షంలోనే ఎమ్మెల్యే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో తిరుపతిరెడ్డి, హౌసింగ్ ఏఈ సుచిత్ర, సీడీసీ చైర్మన్ ఇర్షద్, డైరెక్టర్ రవుఫ్, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, రూపేందర్‌రెడ్డి, రంగు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎండ్రియాల్, సంగోజీవాడి గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అత్యధికంగా కల్యాణ లక్ష్మీచెక్కులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. మండల కేంద్రంలో తమసమస్యలు తీర్చాలని కోరుతూ ఎస్జీటీ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో సాజీద్‌అలీ, శివాజీ, లక్ష్మణచారీ, షౌకత్‌అలీ, సుధాకర్‌రావు, శ్యాంరావు, మేకల రాజు, రాంచంద్రం,గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిన తప్పులతోనే ఊరిలోకి వరద



చిన్న ఎక్లారలో వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, గ్రామస్తులు

- చిన్న ఎక్లారలో పర్యటించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- రైతులను ఆదుకుంటాం

మద్నూర్(జుక్కల్): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చిన్న ఎక్లార గ్రామంలో వరద నీరు వచ్చి చేరిందని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని చిన్న ఎక్లారలో శనివారం వరద నీరు గ్రామంలోకి చేరడంతో పాటు భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని తెలుసుకున్న ఎమ్మెల్యే చిన్న ఎక్లార గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వాగు వరద నీరు ఊర్లోకి వెళ్లినట్లు గ్రామస్తులు ఎమ్మెల్యేతో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నాణ్యత లోపంతో నిర్మించడంతో కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారన్నారు. చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయించి తిరిగి వరద నీరు ఊర్లోకి రాకుండా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. వర్షాలతో గ్రామ శివారులోని 6 నుంచి 7 వందల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ను ఆదుకుంటుందని భరోసా ఇస్తున్నానని, తక్షణమే వ్యవసాయ అధికారులచే పంట నష్టంపై సర్వే నిర్వహించాలని ఆదేశించానని ఎమ్మెల్యే చెప్పారు. రైతులకు పంట నష్ట పరిహారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు హన్మాండ్లు స్వామి, సాయిపటేల్, నాగేశం, మహేశ్, గ్రామస్తులున్నారు.

'జ్వరపీడితులకు రక్త పరీక్షలు చేయాలి'



రికార్డులను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

భిక్కనూరు: జ్వరపీడితులకు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన భిక్కనూరు పీహెచ్‌సీని మెడికల్ ఎడ్యుకేషనల్ కమిషనర్ నరేంద్రకుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణను వైద్య సిబ్బంది బాధ్యతగా గుర్తించి పనిచేయాలన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. భారీ వర్షాలతో వరదలు వస్తున్న నేపథ్యంలో పదిరోజుల్లో కాన్పులు అయ్యే గర్భిణులు సురక్షిత ప్రాంతంలో ఉండేలా చూడాలన్నారు. డెంగీ నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోగులతో మాట్లాడి ప్రభుత్వాస్పత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. మంచి సేవలు అందిస్తున్నందుకు వైద్యురాలు యెమీమాను, వైద్య సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ, స్టాఫ్ నర్సు హరిత తదితరులున్నారు.

వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి అర్బన్ : విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జన్మభూమిరోడ్డులో నాయకులు కాషాయజెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. హిందూ సనాతన ధర్మ పరిరక్షణ, ధర్మసంస్థాపన, హిందు సమాజాన్ని ఏకం చేయడం కోసం 1964 సంవత్సరం గోకులష్టమి రోజున విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేశారని వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు వడ్ల వెంకట స్వామి అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ప్రచార ప్రముఖ్ గోపిరాజ్ శ్రీకాంత్‌రావు, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్, ప్రతినిధులు విశ్వంగుప్తా, అనిల్‌కుమార్, తేజ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్‌హెచ్‌వో నరహరి

కామారెడ్డి క్రైం/తాడ్వాయి/బిచ్కుంద/ఎల్లారెడ్డి/బీబీపేట/ గాంధారి/నాగిరెడ్డిపేట : గణేశ్ నవరాత్రులు, శోభాయాత్ర లను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో శనివారం గణేశ్ మండళ్ల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి మాట్లాడారు. బిచ్కుంద పీఎస్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఎస్సై మోహన్‌రెడ్డి మాట్లాడారు. తాడ్వాయిలోని ఓ గార్డెన్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్సై మురళి మాట్లాడారు. అనుమతులు లేకుండా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేయరాదని ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిలో గణేశ్ మండప నిర్వాహకులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో సీఐ మాట్లాడారు. బీబీపేట రైతు వేదికలో గణేశ్ మండపాల నిర్వాహకులు, యూత్ సభ్యులతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఎస్సై ప్రభాకర్ మాట్లాడారు. గాంధారిలోని హరాశే గార్డెన్స్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులు, యూత్ సభ్యులతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఎస్సై ఆంజనేయులు మాట్లాడారు. నాగిరెడ్డి మండలం గోపాల్‌పేట రైతువేదికలో గణేశ్ మండపాల నిర్వాహకులు, యూత్ సభ్యులతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఎస్సై భార్గవ్‌గౌడ్ మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. భక్తి శ్రద్ధలతో నవరాత్రులు జరపాలని పోలీసులు సూచించారు. సమావేశంలో గ్రామపెద్దలు, అన్ని పార్టీల నాయకులు ఉన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎస్సై మురళి



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎస్సై మోహన్‌రెడ్డి

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

మద్నూర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌పేట్‌లో శనివారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు పంచాయతీ కార్యదర్శి సంజయ్ తెలిపారు. విద్యుత్ తీగల కింద గేదె మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తెగి గేదెపై పడ్డాయి. దీంతో గేదె కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కళేబరానికి పంచనామ నిర్వహించి మేనూర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈకి సమాచారం అందించినట్లు ఆయన వెల్లడించారు.

దాబాపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్ శ్రీమాతా దాబాపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. దాబాలో మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేని దాబాలలో మద్యం సేవించవద్దని ఎస్సై మద్యం ప్రియులకు సూచించారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని వెల్లుట్లపేట శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.43,150ల నగదు, 10 సెల్‌ఫోన్లు, 11 బైకులు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. మరో నలుగురు పరారైనట్లు ఆయన తెలిపారు.

గుంతలో దిగపడిన లారీ



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో ఓ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో దిగబడిపోయింది. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండగా రహదారి పక్కన గుంతలు తవ్వారు. ఈక్రమంలో శుక్రవారం మండల కేంద్రంలోని సమీకృత భవనం ఎదురుగా వర్ని వైపునకు వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో దిగిపోయింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనుల నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు, బార్డర్ లైన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

నీటి గుంతలో పడి ఒకరి మృతి



మృతుడు పురేందర్ గౌడ్(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ శివారులోగల రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో పడి ఒకరు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పురేందర్ గౌడ్(52) గతంలో ఉపాధి కోసం వైన్ షాపుల్లో, కల్లు బట్టీల్లో పని చేసేవాడు. ప్రస్తుతం ఉపాధి లేకపోవడతో పని కోసం వెతుకుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి అతడు ఇందల్వాయి నుంచి సిర్నాపల్లి వైపు నడుచుకుంటూ బయలుదేరాడు. గన్నారం గ్రామ శివారులోగల రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో అతడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



కనకం అనిల్(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మోర్తాడ్‌కు చెందిన కనకం అనిల్(31) ఈనెల 4న బంధువులను కలవడానికి బైక్‌పై శెట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి బయలుదేరగా, పాలెం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలో పడి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. మృతదేహానికి శనివారం ఆర్మూర్ ఆస్పత్రిలో పోసుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు. మృతుడికి తల్లి, భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

బీబీపేట మండలంలో ఒకరు..



మృతుడు పోసు నారాయణ. (ఫైల్)

బీబీపేట: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేట గ్రామానికి చెందిన పోసు నారాయణ (65) గత మూడేళ్లుగా అల్సర్‌తో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దేవునిపల్లి పోలీసులు శనివారం తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితం చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై రంజిత్ తెలిపారు.

నేడు కన్యాకపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న సిద్ధరామేశ్వర ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కన్యాకపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఆదివారం, సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధ్యక్షుడు మురంశెట్టి రాములు, ప్రధాన కార్యదర్శి కాపర్తి శ్రావన్‌కుమార్, కోశాధికారి చీకోటి వెంకటేశంలు శనివారం తెలిపారు. ఈరెండు రోజుల స్థాపిత దేవత పూజ, యంత్ర ప్రతిష్ఠ, కన్యకపరమేశ్వరీ దేవతామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన హోమం పూర్ణహూతి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎఈసీ దయాసిస్ వరల్డ్ వైడ్ చర్చి మీడియా ప్రతినిధిగా దాస్ ఎల్లం

దోమకొండ: మండల కేంద్రంలోని చర్చి నిర్వహకులు దాస్ ఎల్లం వరల్డ్ వైడ్ చర్చి మీడియా ప్రతినిధిగా ఎంపికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని నెల్లూరులో ఈనెల 15వ తేదీన డాక్టర్ టైటాస్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో ఈసమావేశం జరిగిందన్నారు. దేశంలోని పాటు పలు రాష్ట్రాల నుండి 70 మంది బిషప్‌లు సమావేశంలో పాల్గొన్నారన్నారు. ప్రైమట్ ఆర్చ్ బిషప్ విజయ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో డయాసిస్ భారతదేశంలో పాలు సేవా కార్యక్రమాలు నిర్వహణ కోసం తీర్మానం చేశారన్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన బిషప్ జీవై దాస్ ఎల్లంను ఎఈసీ దయాసిస్ ఇండియా, వరల్డ్ వైడ్ చర్చి మీడియా ప్రతినిధిగా నియమిస్తూ ప్రకటన చేశారని ఆయన తెలిపారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

నిజామాబాద రూరల్: మండలంలోని మాధవ నగర్ పరిధిలో వీధి కుక్కల దాడిచేయడంతో ఓ బాలుడికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మాధవనగర్ మూడో డివిజన్‌కు చెందిన సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు శనివారం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. వీధికుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేసి, బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

సొసైటీల పదవీకాలం పెంపుపై హర్షం



పిట్లంలో నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్లు

పిట్లం(జుక్కల్): ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్ పదవీ కాలాన్ని మరోసారి ఆరు నెలలు పొడిగించినందునందుకు గాను మండలంలోని సహకార సంఘం చైర్మన్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్ షెట్కార్‌ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, మండలంలోని సహకార సంఘం చైర్మన్లు ,ఒంటరి శపథం రెడ్డి, జార నాగి రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన



సాయికుమార్ (ఫైల్)



నగరంలోని ఆస్పత్రి ఎదుట నిరసన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

నిజామాబాద్‌నాగారం:రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా.. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సాయికుమార్(26) మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేస్తుండేవాడు. అతడు శనివారం హైదరాబాద్ నుంచి ఆర్మూర్‌కు కారులో బయలుదేరగా, కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి హైవే వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రుడెన్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి ఆస్పత్రిలో మృతిచెందాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందినట్లు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, మెడికల్ రిప్రజంటేటివ్ సంఘం సభ్యులు ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు నూర్జహాన్, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు రషీదాభేగం, టీడీపీ అధికార ప్రతినిధి పురుషోత్తం, మెడికల్ రిప్రజంటేటివ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.